

# క రాజు కథలు

## - సింగీతం శ్రీనివాసరావు



### నా మాట

అపుడెపుడో - కాలేజీల కాలం. ఖాసా సుబ్బారావుగారు, గోరా శాస్త్రిగార్ల ప్రోత్సాహంతో భారతి, స్వతంత్రలాంటి పత్రికల్లో కొంతకాలం నా రచనా కేళి సాగింది. ఆనాడు రాసిన "అంత్యఘట్టం" నాటికను ఇప్పుడు కూడా ఆంధ్ర విశ్వవిద్యాలయంలాంటి చోట్ల ప్రదర్శిస్తున్నారంటే అదో తృప్తి. ఆ రోజుల్లోనే టంగుటూరి సూర్యకుమారిగారు నటించి, ప్రదర్శించిన 'చిత్రార్జున' నాటకం పాటలతో సహా రాశాను. ఈ ప్రదర్శనను పండిత జవహర్ లాల్ నెహ్రూగారు ఢిల్లీలో చూశారు. ఆ తర్వాత టామ్ బకన్ అనే స్కాట్లండ్ రచయిత దీనిని ఇంగ్లీషులో తర్జుమా చేస్తే, దీన్ని అమెరికాలో తెలుగు పాటలతో ప్రదర్శించారు. ఈ తర్వాత నేను పెద్దగా రాసిందేది లేదు. "మీ సినిమాలకి మీరే మాటలు రాస్తే బాగుంటుంది" అని జంధ్యాలగారు చాలాసార్లు చెప్పారు. ఆయన మాటల్ని కాదనలేక పుష్పక విమానం తీశాను. "మీరు పాటలు రాయండి" అంటూ వేటూరిగారు ఎప్పుడూ ప్రోత్సహిస్తూ వుండేవారు. 'భైరవద్వీపం'లో ఒకపాట ఆయన రాయాల్సుంది. ఎన్నాళ్ళకూ ఆయన దర్శనం లభించకపోయేసరికి గత్యంతరం లేక నేనే "విరిసినది వసంతగానం" పాట రాశాను. ఆ పాట బాగా రాశానని వేటూరిగారు మెచ్చుకోవడం నాకొచ్చిన పెద్ద అవార్డు.

మళ్ళీ ఇన్నాళ్ళకు  కాలేజి రోజుల ఉత్సాహం మళ్ళీ పుట్టుకొచ్చింది. ఆ రోజుల్లో పింగళి నాగేంద్రరావుగారు నా చేత స్క్రిప్టు ఒక రఫ్ వర్షన్ సీన్లు రాయించేవారు. వాటిల్లోంచి ఎన్నో ఐడియాలూ, శ్రీకృష్ణార్జునయుద్ధంలో అర్జునుడి పేరు 'అజిభీధఫపావిశ్వేసకి' లాంటివి ఎన్నో వచ్చేవి. ఇంట్లో వాటిని ఫెయిర్ కాపీ చేసే పని నా అర్ధాంగి కల్యాణిది. మళ్ళీ ఆ రోజులు గుర్తొచ్చేలా ఈ కథల్ని కల్యాణే ఫెయిర్ కాపీ చేసింది. ఈ కథల్ని ఆనందిస్తూ - "ఎంజాయ్" చేస్తూ అంటే కరెక్ట్‌గా చెప్పామనిపిస్తుంది - రాశాను. చదివిన వాళ్ళూ ఎంతో కొంత ఎంజాయ్ చేస్తే మరింత ఆనందిస్తాను.

*సింగీతం శ్రీనివాసరావు.*

మిత్రులు సింగీతం శ్రీనివాసరావుగారికి నాకూ కనీసం 50 ఏళ్ళ పరిచయం. ఆయన భారతికి 'అంత్యఘట్టం' రాసే రోజుల్లో నేనూ భారతికి రాస్తున్నాను. దరిమిలాను ఆయన సినిమా రంగంలో స్థిరపడిన తర్వాత యిద్దరం కలిసి చాలా సినిమాల్లో పనిచేశాం. ఆయన దర్శకత్వం, వహించిన సినిమాలకు నేను రచన చేశాను. ఆయన దర్శకత్వంలో నేను నటుడిగా పనిచేశాను. ఈ రెండూ చెయ్యకపోయినా ఆయన తీసే అన్ని సినిమాల కథలూ ముందుగా నాకు చెప్పి నాతో చర్చించడం ఒక ఆనవాయితీ. నాకు వారి నాన్నగారు రామచంద్రరావుగారు తెలుసు. ఈ విషయాన్ని ఇంత విపులంగా, ముందు చెప్పడానికి కారణం - ఆయన సెన్సాఫ్ హ్యూమర్‌తో నాకు అయిదు దశాబ్దాల బంధుత్వం ఉన్నదని చెప్పడానికి.

'ఆదిత్య 369'లో నేను, టినూ ఆనంద్, అమ్రేష్‌పురీ నటిస్తున్నాం. మరొకరెవరో గుర్తులేదు. వాళ్ళ చెవులకి వైర్లు బిగించి - భయంకరంగా వయొలిన్లు వాయించే ఏర్పాట్లు చేశారు. ఆ శబ్దాలకి వారి చెవుల్లోంచి రక్తం కారుతుంది. నా చేత ఒక డైలాగ్ చెప్పించారు శ్రీనివాసరావుగారు. నా బాస్ అమ్రేష్‌పురీతో అంటాను. "బాస్, మీరు చాలా గొప్పవారు. వయోలిన్స్ ద్వారా అద్భుతమైన 'వయొలెన్స్'ని సృష్టించగలుగుతున్నారు" అని. ఇది ఎప్పుడు జ్ఞాపకం వచ్చినా గిలిగింతలు పెట్టినట్టు నవ్వుకుంటాను.

శ్రీనివాసరావుగారు రాసిన కథల్ని చదవడం ఇదే మొదటిసారి. చదివాక - మొదట నిర్ఘాంతపోయాను. కారణం మెల్లగా చెబుతాను. అవి చిన్నపిల్లల కథల్లాగ అతి సరళంగా, అమాయకంగా చెయ్యి పట్టుకుని నడిపిస్తున్న పసివాడిలాగా నడిపించుకుపోయాయి. మంచి కథకి అది మొదటి, గొప్ప లక్షణం.

కాగా, మంచి భాష నేర్పేవాడు భాష శాస్త్రికావడం, బాగా పాడేవాడు తాలం బ్రహ్మయ్య, శివ భక్తుడు కాశీ విశ్వేశ్వరయ్య కావడం, దుర్మార్గులు కోరమీసాల కోటయ్య, మిడిగుడ్ల సిద్ధయ్య కావడం - యివన్నీ చిన్నపిల్లల కథలకి ఏమి తికమకలు లేని Stylisation. ఇక్కడితో ఈ కథలకి సంబంధించిన చిన్నపిల్లల ముద్ర ఆగిపోతుంది. చదివించే గొప్ప గుణాన్ని వాక్యాల, పేర్ల సన్నివేశాలతో సాధించారని చెప్పడమే నా ఉద్దేశం. అయితే వీటికి కేవలం చదివించే గుణం మాత్రమే ఉన్నదని సరిపెట్టుకోవడానికి వీలులేదు. లోకధర్మాన్నీ, లోకం తీరునీ, సమాజ స్వరూపాన్నీ అతి సునిశితంగా, కాని సున్నితంగా వెక్కిరించే - అది కేవలం వెక్కిరింత మాత్రమే కాదని అనిపించే సెన్సాఫ్ హ్యూమర్‌ని జతచేశారు. అదీ ఈ కథల్లో రచయిత సాధించినది.

సరళంగా చదివించి, సరసంగా నవ్వించి, 'అమ్మో!' అని తుళ్ళిపడేటట్టు చేసి సమాజంలోని వైపరీత్యానికి కనుబొమ్మలు ముడివేయడమో, కత్తులు నూరడమోకాక, నవ్వుతూ గాటుపెట్టే అందమయిన ఆయుధాన్ని సానబెట్టారు రచయిత ఈ కథల్లో. ఈ ధోరణిలో మార్క్‌ట్వెయిన్, భమిడిపాటి కామేశ్వరరావు వంటి రచయితల్ని స్ఫురణకు తెస్తారు రచయిత. అసలు ఏ రచయితయినా సమాజంలో అవకతవకల్ని చూసి కళ్ళెర్రజేయడం అతని పరిధిని దాటడం అనిపిస్తుంది నాకు. కానీ వ్యగ్రతల్ని చూపి నవ్విస్తూ వాటిని పాఠకుడి స్పృహలోకి తీసుకురావడం రచయిత పరిమితిగా నేను నమ్ముతాను. No Social Problem can be solved by any writer on paper. He can only create the consciousness. హాస్యం ఆ అపశృతిని ఫోకస్‌లోకి తెస్తుంది. ఆలోచించేట్టు చేస్తుంది. అంతవరకే రచయిత పని. తరువాత ఏ పనిని చేపట్టినా అది తనదికాని పనిని నెత్తిన వేసుకోవడమే అవుతుంది.

కొట్టండి చంపండి అనేవాడికంటే, అవినీతిని నవ్వుతూ అలంకరించి, కితకితలు పెట్టే రచయిత మంచి హెచ్చరికని చేయగలుగుతాడని నేను నమ్ముతాను. ఆ పనిని చాలా బాధ్యతగా, గంభీరంగా, ప్రొఫెషనల్‌గా, తనకి వారసత్వంగా వచ్చిన సెన్సాఫ్ హ్యూమర్‌తో ప్రతీ కథలోనూ చేసి చూపించారు.

హాస్యానికి అద్భుతమైన పదును ధ్వని. కేవలం నవ్వించే హాస్యం - వెకిలిగానూ, కొండకచో వెగటుగానూ ఉండవచ్చు. కానీ సమాజశీలాన్ని చిన్న గాటుతో ఉలిక్కిపడేటట్టు చేయడం ఆరోగ్యకరమైన ఉత్తమ హాస్యం లక్షణం. వెకిలి 'ధ్వనుల'ను రాబట్టే చాలామంది రచయితలు మనకున్నారు. అర్థంలేని 'పన్'లను వాడి కంపు కొట్టించే ఘనులున్నారు. నాకు వీరందరి మధ్యా సింగీతం ప్రత్యేకంగా, విభిన్నంగా దర్శనమిస్తారు. ఈ మాట చెప్తున్నప్పుడు నా మనస్సులో మార్క్‌ట్వెయిన్ ఉన్నారు.

ఆయన ఎప్పుడో ఇండియా వచ్చారట. దక్షిణాదిన చాకలి బండమీద బట్టలు ఉతకడం చూశారట. "ఆహా! ఒక్క భారతదేశంలోనే బట్టల్తో బండల్ని బద్దలు కొట్టే విచిత్రాన్ని చూశాను" అన్నారట.

హాస్యానికి వింతకోణం, సంధించగలిగితే వింత పదునూ, సమర్థుడి చేతుల్లో వింత అస్త్రమూ కాగలదు. ఈ పనులన్నీ చేయగల నిష్ణాతుడు సింగీతం శ్రీనివాసరావు. చేసి చూపిన వేదిక - "క రాజు కథలు."

*గొల్లపూడి మారుతీరావు.*

# భజన విజయం

క రాజుగారి రాజ్యంలో ఉన్న ప్రత్యేకతల్లో ఒకటి అక్కడున్న నరనారాయణుల ఆలయాలు. ఇవి రెండు. నగరం ఉత్తరాన నారాయణుడి గుడి వుంటే దక్షిణాన నరుడి గుడి ఉంది. ఒకప్పుడు నరనారాయణులకు ఒకే దేవాలయం ఉండేదట. అప్పుడున్న ఒక రాజుగారికి నరనారాయణులు స్వప్నంలో కనిపించి ఇచ్చిన ఆజ్ఞప్రకారం నగర క్షేమం కోసం నారాయణునికి వేరేగా, నరుడికి వేరేగా దేవాలయాలు కట్టడం జరుగిందంటారు. ఎలాగైతేనేం, ఇవి అరుదైన ఆలయాలు. కానీ రానురాను వీటిని సందర్శించే జనం సన్నగిల్లుతున్నారనేదే క రాజు ఆవేదన. దీనికి ముఖ్యమైన కారణం అక్కడున్న పూజారి బాగా వృద్ధాప్యంలో ఉండడం. పైగా రెండు గుడులూ అతనే చూసుకోవల్సింది. ఏ గుడికి ఎపుడొస్తాడో తెలీదు. దానికి తోడు ఈ వయస్సులో అతను అర్చన చేస్తుంటే ఎవరికీ వినపడేదికాదు. దీంతో భక్తులకు గుడికెళ్ళాలనే ఉత్సాహం అంతగా ఉండేదికాదు.

క రాజు మంత్రిని పిలిపించి తన ఆలోచనని వివరించాడు.

"మంత్రీ! మీరు వెంటనే ఇప్పుడున్న వృద్ధ పురోహితునికి పారితోషికంతో పాటు విశ్రాంతిని జతచేసి ఇప్పించండి. ఆ తర్వాత ఒక సమర్ధుడైన వ్యక్తిని ఎంపిక చేసి అతన్ని పెద్దదైన నారాయణస్వామి ఆలయానికి పూజారిగా నియమించండి" అన్నాడు.

"మరి నరుడి గుడికి..?" ఏదో చెప్పబోయాడు మంత్రి.

"అది చిన్న గుడేగా! దాని కెవర్నో చూడమని మన ధనపాలుడికి చెప్తానులెండి" అన్నాడు క రాజు. మొత్తం పెత్తనం తన చేతికిందే ఉండాలని మంత్రి ఇష్టపడ్డా, క రాజు ఆజ్ఞ అయిన తర్వాత ఏమీ మాట్లాడలేక సరేనన్నాడు.

మంత్రి రాజ్యమంతా గాలించి చివరకు కేశవశర్మను ఎంపిక చేశాడు. కేశవవర్మ సంస్కృతంలో అసమాన పండితుడే కాక వివిధ పూజా వ్రత నిర్వహణలో ఉద్ధండుడు అతని కంఠంలోంచి ఖంగుమంటూ సుప్రభాత శ్లోకాలు, సహస్ర నామార్చనలూ దొర్లుతూంటే వాటి ఉచ్చారణా స్వచ్ఛతకు, పవిత్రతకు విజ్ఞులు ముగ్ధులయ్యేవారు. కేశవశర్మ కూడా దీన్ని దైవ కటాక్షంగా ఎంచి ఉద్యోగాన్ని సవినయంగా స్వీకరించాడు.

క రాజు రాజ్యంలో మంత్రికి అనుచరులుగా వివిధ శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులున్నారు. ఆర్థిక విషయాలను చూసుకునే ధనపాలుడు, పసివారి క్షేమం చూసుకునే శిశుపాలుడు, ఇంకా గృహపాలుడు, న్యాయపాలుడు - ఇలా ఎందరో, వీరిలో ధనపాలుడు ముఖ్యుడు. ఎవరేం చేయాలనుకున్నా ధనపాలుని అనుగ్రహం తప్పనిసరి నగరంలోని బాలకవులు ధనపాలుని గురించి

ధనపాలుడు కోపించిన  
కనుమరుగౌ కాసులన్ని క్షణమున మఱియా  
ధనపాలుడె కరుణించిన  
కనకపు వర్షములె కురియు గదరా సుమతీ

అంటూ విలాసంగా పాడుకునేవారు. ఈ విషయం క రాజుకు కూడా తెలుసు కనుక, మంత్రిని నొప్పించక ధనపాలుని ఆదరిస్తూ చిన్నగుడికి ఒక పుజారిని చూడమని అతన్ని ఆదేశించాడు.

దీర్ఘంగా ఆలోచించి ధనపాలుడు నారాయణ శర్మ అనే వ్యక్తిని ఎంపిక చేశాడు. ఈ వార్త విని తెలిసినవాళ్ళు ఒకరికొకరు ప్రశ్నార్ధకంగా చూసుకున్నారు. ఎందుకంటే నారాయణశర్మ పెద్దయాగాలు, హోమాలు చేయగలిగిన సమర్థుడు కాదు సరికదా, చిన్నప్పుడు స్వల్పకాలం సంస్కృత పాఠశాలలో చదివాడట. అదెప్పుడో మర్చిపోయుంటాడు. ఇప్పుడు అతని ముఖ్యమైన వ్యాపకం ఊళ్ళో పండుగలు,

ఉత్సవాలు వచ్చినపుడు ఇంట్లోనే ప్రసాదాలు తయారుచేసి దేవుడికర్పించి వాటిని అమ్మడం. నారాయణుడి ప్రసాదమన్నా భక్ష్యాలన్నా జగత్ ప్రఖ్యాతం. అయినా ఒక పూజారిగా ఇతన్ని నియమించడం ఏమిటని కొందరి సందేహం.

ధనపాలుని ఈ నిర్ణయంలో ఒక రహస్యం ఉంది. నగరంలోని చిన్న, పెద్ద వ్యాపారస్థులందరూ ప్రతినెల ధనపాలుడి దర్శనం చేసుకోవడం ఎప్పట్నుంచో వస్తున్న అలవాటు. దీన్ని "ఉభయకుశలోపరి కార్యక్రమం" అంటూండేవారు. తమ దగ్గరకు వచ్చిన ఒక్కొక్కరినీ ధనపాలుడు "రెండూ రెండూ కూడితే ఎంత?" అని ప్రశ్నించేవాడు. వచ్చిన వారంతా "నాలుగు" అని చెప్పి నాలుగు వరహాలిచ్చి వెళ్ళిపోయేవారు. ఇదే ప్రశ్నను నారాయణశర్మను మొదట్లో కలిసినప్పుడు కూడా అడిగాడు. నారాయణశర్మ మాత్రం అందరిలా కాకుండా "కూడితే ఎంత వుండాలని మీ కోరిక?" అని అడిగాడు. ఈ జవాబు ధనపాలుడికి చాలా నచ్చింది. అప్పట్నుంచీ నారాయణ శర్మ ధనపాలుడి నమ్మకస్థుల్లో ఒకడు. ఆ నమ్మకంతోనే ఈనాడు నరుడి గుడికి అతన్ని పూజారిగా నియమించాడు.

మంత్రి మాత్రం ఈ వార్తవిని లోలోన సంతోషించాడు. నోట పలుకురాని నారాయణుడు ఎటూ పూజారిగా విఫలుడౌతాడు. దాంతో ధనపాలుడికి ఎనలేని అప్రతిష్ఠ వస్తుంది. ఆ సమయం కోసం వేచి ఉన్నాడు మంత్రి.

ఒక శుభ ముహూర్తాన కేశవశర్మ నారాయణ గుడిలో పూజలు మొదలెట్టాడు. గంభీరమైన కంఠస్వరంతో కూడుకున్న అతని స్వచ్ఛమైన మంత్రోచ్చారణ గర్భగుడిలో మారుమోగింది. కానీ దాన్ని ఆనందించడానికి అక్కడ పట్టుమని పదిమంది కూడాలేరు.

అదే సమయంలో నారాయణశర్మ నరుడి గుడిలో పూజలు ప్రారంభించడానికి సన్నద్ధుడయ్యాడు. అతనికి ఒక్క ముక్క మంత్రం రాకపోయినా ముఖం మాత్రం సర్వజ్ఞునికున్న మందహాసంతో తొణికిసలాడింది. అప్పుడక్కడున్న ఊళ్ళోని భక్తులు అయిదారుగురే. కానీ నారాయణ శర్మ ఒక కొత్త ప్రక్రియకు నాంది పలుకుతూ తన శిష్యబృందాన్ని ఉద్దేశించి, "చూడండి! నేను మంత్రాలు చదువుతూ మీరు యాంత్రికంగా వింటూంటే దానివల్ల భక్తిభావం పుట్టదు. పుణ్యలాభం లభించదు. అందుకని నేను అర్చన మొదలెట్టిన క్షణాన మీరందరూ భక్తిగా,

జయ జయదేవా నరదేవా

జయహే జయహే నరదేవా

అంటూ భజన మొదలెట్టండి. అర్చన కొనసాగించినంతసేపూ భజన కూడా కొనసాగాలి. అప్పుడు మీకు నరభగవానుని కటాక్షం సంపూర్ణంగా లభించగలదు" అన్నాడు.

ఈ ఉపదేశం శిష్యులకు ఉద్దేశించినదైనా దాని ప్రభావం వల్ల అక్కడి భక్తులందరిలో ఒక కొత్త చైతన్యం ఆవరించింది. నారాయణశర్మ 'ఓం' అనీ అనగానే అందరూ 'జయ జయ నరదేవా' అంటూ భజనలు మొదలెట్టారు. నారాయణుడు మధ్య మధ్య 'ఓం' అంటూ ఏదో మంత్రం చెప్పినట్టు పెదిమలు కదిలిస్తున్నాడు. భక్తులిదేం పట్టించుకోలేదు. వాళ్ళ భజనలో వాళ్ళు పూర్తిగా తన్మయులై ఉన్నారు. పూజ ముగిసింది. భక్తులు ఈ కొత్త ప్రక్రియకు ఆనందం వెలిబుచ్చుతుండగా నారాయణుడు లోపల్నుంచి ప్రసాదాలను తెచ్చి అందరికీ పంచిపెట్టాడు. ఇనుమడించిన ఆనందంతో భక్తులు స్వీకరించి, కొంత ప్రసాదాన్ని వారివారి ఇళ్ళకు తీసుకుపోయారు.

ఇలా ప్రారంభమైన నరభగవానుని భజన పూజల ఉత్సాహం అతి కొద్దికాలంలో నగరమంతా దావానంలా పాకింది. రానురాను వందలాది జనం వందలాది జనం గుడిని సందర్శించి నారాయణశర్మ 'ఓం' అనగానే 'జయజయ' అంటూ భజన చేసి ప్రసాదాన్ని పుచ్చుకుని వెళ్ళేవారు. నరుడి గుడి ఖ్యాతి ప్రబలి పొరుగూళ్ళ నుంచి కూడా జనం రావడం మొదలుపెట్టారు. ఇప్పుడు నారాయణుడి గుడిని పట్టించుకున్నవారు లేరు. ఎవరైనా మనం ఒకసారి నారాయణుడి గుడికి వెళ్ళొచ్చుకదా అంటే, "ఎందుకూ నరనారాయణులు (అంటే పూజారి నారాయణుడు) ఇద్దరూ ఇక్కడే ఉన్నారు కదా!" అని అనుకునేవారు.

నరుడి మహిమ నలుమూలలా వ్యాపించింది. భక్తుల సంఖ్య పెరిగేకొద్దీ ప్రసాదాల తయారీ పెరిగింది. ఇందుకుగాను నారాయణశర్మకు ఒక కొత్త భవనాన్ని ధనపాలుడు తన సంతోషానికి చిహ్నంగా ప్రసాదించాడు. భజన బృందాల చందాలతో గుడిముందు అరవై అడుగుల నరుని విగ్రహం నిర్మించడమే కాక ముఖ్యమైన వీధుల్లో కూడా వీటిని స్థాపించడం జరిగింది. భజన ప్రక్రియలో ఒక విశేషం ఉంది. చిలకగాచిలకగా మజ్జిగలోంచి వెన్న వచ్చినట్టు భజన చేయగా చేయగా కొందరిలో ఒక వీరావేశం పుట్టుకొస్తుంది. వాళ్ళు క్రమేణా భజనవీరులౌతారు. ఎవరైనా వారి భజనలకు ఆంక్షలు పెడితే అలాంటి వాళ్ళిక నరకానికి దారి చూసుకోవలసిందే

ఇదంతా గమనిస్తున్న మంత్రికి మతిపోయింది. అతని కోపమంతా తను ఏరికోరి ఎంపిక చేసుకున్న కేశవశర్మ మీదికి వెళ్ళింది. వెంటనే నారాయణుడి గుడికి వెళ్ళాడు. అక్కడ భక్తులెవ్వరూ లేరు. గర్భగుడిలో అంతా చీకటిగా ఉంది. కాని లోపల్నుంచి 'అష్టోత్తర శతనామార్చన' వినిపిస్తోంది. అది కాగానే కేశవశర్మ బయట వెలుగులోకి వచ్చి మంత్రిని చూసి నమస్కరించాడు. మంత్రి తన కోపాన్ని ఆపుకుంటూ "ఏమిటయ్యా కేశవవర్మా! మహా పండితుడివి. నీవంత చక్కగా దేవతార్చన చేస్తున్నా భక్తులెవ్వరూ రారేమిటి?" అని అడిగాడు.

"అలాగాండీ? నాకు తెలీదే నేనేదో రోజూ వచ్చి పూజా కార్యక్రమాలు ముగించుకుని వెళ్తున్నాను. ఎవరొచ్చేదీ రానిదీ చూడలేదే?" అన్నాడు కేశవశర్మ సవినయంగా.

మంత్రికి తలను గోడకేసి కొట్టుకోవాలనిపించింది. "మరి చీకట్లో పూజలేమిటయ్యా?" మళ్ళీ అడిగాడు మంత్రి.

"అదాండీ - మూడురోజులుగా దీపాలు వెలిగించడానికి నూనె లేదండి" అన్నాడు కేశవశర్మ.

"మరి అడగొచ్చు కదా?"

"అది నాకు తోచలేదండి" అన్నాడు కేశవశర్మ - ఇందులో పెద్దగా మునిగిపోయిందేముందీ అనుకుంటూ.

ఆ సాయంత్రమే నరభగవాన్ భజన సంఘం నుండి మంత్రికి ఒక ఆహ్వానం వచ్చింది. నరదేవునికి వారం రోజులు నిర్విరామ (స్తుతి) కార్యక్రమాన్ని చేబడ్తున్నామని, దాని ప్రారంభోత్సవానికి మంత్రిగారే అధ్యక్షపీఠాన్ని అలంకరించాలని. ముందు దీన్ని తిరస్కరించాలనుకున్నా భజనవీరుల ఆవేశం గ్రహించగలిగినవాడు కనుక సరేనన్నాడు మంత్రి.

మరుసటి రోజు ఉదయం యధావిధిగా మంత్రి క రాజుగారిని దర్శించుకున్నాడు. మంత్రి ముఖకవళికలు చూడగానే అతని మనస్సులో ఏముందో అట్టే కనిపెట్టేసిన క రాజు మంత్రి దగ్గరికొచ్చి మృదువుగా ఉపదేశించాడు.

"చూశారా మంత్రీ అంత పెద్ద గుడిలో వున్న నారాయణుడు ఎక్కడో మారుమూల ఉన్నట్టున్నాడు. చిన్నగుడిలో ఉన్న నరుడు ప్రఖ్యాతుడైనాడు. దీనికంతా కారణం ఒక్కటే. భజన చేసేవాళ్ళు లేకుంటే ముక్కోటి దేవతలూ మూల కూర్చోవలసిందే ఈ నరుడేకాదు, ఏ నరుడైనా సరే. చుట్టూ భజన చేసేవాళ్ళుంటే చాలు. మహిమాన్వితుడౌతాడు. ఈ పరమసత్యాన్ని గ్రహించి మీ తదుపరి కార్యక్రమాన్ని నిర్వర్తిస్తే ఐశ్వర్యం కన్నా ఆరోగ్యం మిమ్మల్ని వరిస్తుంది" అని చెప్పి క రాజు వెళ్ళిపోయాడు.

క రాజు ఉపదేశంలోని తత్త్వం మంత్రికి అర్ధమయింది.

నరస్తుతి ప్రారంభోత్సవం రోజు మంత్రికి ఘనంగా స్వాగతం పలికి అధ్యక్ష పీఠం మీద కూర్చోబెట్టారు. మంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ, "ఈరోజు ఈ నరభగవానుని విశ్వరూపమేమిటో మనకు తెలిసేటట్టు చేసిన శ్రీ నారాయణశర్మను అభినందిస్తూ అతనికి 'భజన సార్వభౌముడ'నే బిరుదును ప్రసాదించవలసిందిగా మహారాజును అర్ధిస్తున్నాను" అన్నాడు. ఉద్రేకపూరితమైన భక్తుల చప్పట్లు నలుమూలలా మారుమోగిపోయాయి.

"ఇప్పుడు నేను మంత్రిని కాను. భక్తుణ్ణి. భజన సంఘంలోని ఒక సభ్యుణ్ణి" అంటూ మంత్రి 'జయ జయ జయహే నరదేవా' అంటూ భజన మొదలెట్టాడు. వెంటనే భక్తులంతా ఆవేశంతో 'జయ జయ జయహే నరదేవా' అంటూ గొంతులు కలిపారు.

*(ఈ కథలన్నీ గతంలో హాసం పత్రికలో ప్రచురించబడ్డాయి. అంతర్జాతీయంగా ఉన్న తెలుగువారందరికి చేరాలన్న ఉద్దేశంతో రచయిత ప్రత్యేక అనుమతితో పునర్ముద్రిస్తున్నాము )*

*(వచ్చేనెలలో మరోకథ)*

Post your comments